మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

కల్హేర్, నవంబర్ 5: వార్షిక తనిఖీల్లో భాగంగా కల్హేర్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ వెంకట్‌రెడ్డి తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. గత సంవత్సరం కంటే నేరాల సంఖ్య, కేసుల పరిష్కారంపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎస్ఐ వెంకటేశం, సిబ్బంది ఉన్నారు.

వైద్య సేవలపై సమీక్ష

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గాయత్రీదేవి

గుమ్మడిదల, నవంబర్ 5: ప్రభుత్వ దవాఖానల్లో అందుతున్న వైద్య సేవలపై జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మధుకర్ ఆధ్వర్యంలో వైద్య సేవలపై చర్చించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సిబ్బందికి సూచించారు. ప్రైవేట్ క్లినిక్‌ల కంటే సర్కార్ దవాఖానల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందుతాయన్నారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

11 నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 5: డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్టు తారా ప్రభుత్వ అటానమస్ కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రమేశ్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి మూడో సెమిస్టర్, 21 నుంచి ఐదో సెమిస్టర్ థియరీ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దుర్గాభవానికి తొలి బోనంతో డప్పు కళాకారులతో కలిసి వస్తున్న భక్తులు

కోహీర్, నవంబర్ 5: మండలంలోని కొత్తూర్(డి) గ్రామంలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుకళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపు నిర్వహించి దుర్గాభవానీకి తొలి బోనం సమర్పించారు. అందంగా అలంకరించిన బోనాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, మాణిక్ ప్రభు, సంగమేశ్వర్, అశోక్, షఫీయొద్దీన్, రంగయ్య పాల్గొన్నారు.

చట్ పూజలకు ఏర్పాట్లు

మాట్లాడుతున్న వరప్రసాద్‌రెడ్డి

బొల్లారం, నవంబర్ 5: బొల్లారం మున్సిపాలిటీలో చట్ పూజల ఏర్పాట్లపై పోచమ్మ బస్తీలోని దుర్గామాత ఆలయంలో రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్‌రెడ్డి కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. ఆలయాన్ని శుద్ధి చేసి పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని సమావేశంలో తీర్మానించారు. చట్ పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దినాథ్, రాజారామ్, శ్రీమన్నారామణ, చంద్రశేఖర్, జేజేసింగ్, అఖిలేశ్‌సింగ్, ఉద్యానంద్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రవిశంకర్

సంగారెడ్డి, నవంబర్ 5: కేంద్ర ప్రభుత్వం టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ప్రసాది రవిశంకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందర్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రసాది రవిశంకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాల నుంచి పని చేస్తున్న రవిశంకర్‌కు టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

కలెక్టర్ క్రాంతి వల్లూరి

అందోల్, నవంబర్ 5: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాదులాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందిని, రైతులకు ఇక్కడే పూర్తి మద్దతు ధర లభిస్తుందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టాలన్నారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. గ్రామ శివారులో రైతుల వద్దకు వెళ్లి వరి కోతలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో పాండు, గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, ఏపీఎం మాణిక్యం పాల్గొన్నారు.

నాదులాపూర్‌లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

ఆటోడ్రైవర్ల పొట్టకొడుతున్న కాంగ్రెస్

దౌల్తాబాద్‌లో ధర్నా చేస్తున్న సీఐటీయూ ఆటో యూనియన్ల నాయకులు, ఆటో డ్రైవర్లు

హత్నూర, నవంబర్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆటోడ్రైవర్ల పొట్టగొట్టిందని సీఐటీయూ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా ఉపాధ్యక్షుడు కోనంపేట శేఖర్ ఆరోపించారు. మంగళవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో సీఐటీయూ ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటోడ్రైవర్లకు ప్రతినెలా రూ.12 వేలు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి ఆటోడ్రైవర్ల పొట్ట కొట్టిందన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం కల్పించడంతో గిరాకీ తగ్గి ఆటోడ్రైవర్లు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దుస్థితి నెలకొన్నదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ఆటోడ్రైవర్ల అవస్థలను గుర్తించి ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ ప్రధాన కార్యదర్శి బట్టు మారుతిరాజు, నాయకులు వెంకటేశ్, పోచయ్య, సూర్యనాయక్, లక్ష్మారెడ్డి, బద్రి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు చెరువులను సుందరీకరిస్తాం

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 5: పటాన్‌చెరు, తెల్లాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని మూడు చెరువులను సుందరీకరిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, ముత్తంగి పరిధిలోని ఎనుక చెరువులను రూ.28.36 కోట్లతో సుందరీకరించేందుకు చెరువులను పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు డివిజన్ పరిధిలో చెరువులను సుందరీకరించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. తిమ్మక్క చెరువుకు ఏపీఆర్ గ్రూప్ యాజమాన్యం సౌజన్యంతో రూ.3.46 కోట్లతో సాకి చెరువును ఇంకార్ గ్రూప్ రూ.8 కోట్లతో, ముత్తంగి ఎనుక చెరువును రూ 6.90 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి చెరువు కట్టపైన సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, పిల్లల పార్క్, తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్ఎండీఏ చెరువుల విభాగం డీఈ రామారావు, జీహెచ్ఎంసీ చెరువుల విభాగం డీఈ నలిని, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాకీ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

బాధిత కుటుంబాలకు పరామర్శ



జహీరాబాద్: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

హత్నూర: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కల్హేర్: పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

జహీరాబాద్, నవంబర్ 5: జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలై జహీరాబాద్ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకులతో కలసి వెళ్లి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

హత్నూరలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, నవంబర్ 5: మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎండీ మహమూద్(మమ్ము) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందడంతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శ

కల్హేర్, నవంబర్ 5: మండలంలోని అలీఖాన్‌పల్లి గ్రామానికి చెందిన విస్లవత్ సంతోష్ ఇటీవల మృతి చెందారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు నారాయణ, అంజయ్య, నార్యానాయక్, తేజ్యనాయక్, నర్సింహులు, గోప్యనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభం

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 5: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. డీఈవో వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అమూల్యమ్మలతో కలిసి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి హాకీ జట్లు పోటీలలో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు హాజరైన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. టీఎస్ జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఖాసీం బేగ్, హోప్ న్యూరో ఎండీ డాక్టర్ కృష్ణమూర్తి, పీడీలు రాజాగౌడ్, సుభాష్, పీఈటీలున్నారు.

హాకీ పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు



వైభవంగా ఎల్లమ్మ జాతర

జిన్నారం, నవంబర్ 5: మదారం గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. సోమవారం ప్రారంభమైన జాతరలో ఘటం ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం ఎల్లమ్మ కల్యాణం, బోనాల జాతర నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు, మొక్కులు సమర్పించారు. మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు జాతరలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మల్లేశ్, గణేశ్, రాంచందర్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

జిన్నారం, నవంబర్ 5: ఖాజీపల్లి గ్రామానికి, జీఎంఆర్ కాలనీ, జర్నలిస్టు కాలనీకి బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ కలిశారు. ఈ మేరకు మంగళవారం మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు రమాకాంత్ తెలిపారు. కూకట్‌పల్లి నుంచి మల్లంపేట్ మీదుగా జీఎంఆర్, జర్నలిస్టు కాలనీ వరకు, చందానగర్ నుంచి మియాపూర్, ఐడీఏ బొల్లారం మీదుగా ఖాజీపల్లి వరకు రెండు రూట్లలో బస్సులు నడపాలని మంత్రిని కోరాగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. త్వరలోనే రెండు రూట్లలో రెండు చోట్లకు బస్సులు ప్రారంభమవుతాయని, అడిగిన వెంటనే స్పందించి బస్సులు మంజూరు చేసినందుకు మంత్రికి రమాకాంత్ ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దండే రమాకాంత్

చిందరవందరగా పడి ఉన్న బీరువాలోని వస్తువులు

జహీరాబాద్ పట్టణంలో పట్టపగలే చోరీ

జహీరాబాద్, నవంబర్ 5: జహీరాబాద్ పట్టణంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో మంగళవారం ఉదయం తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కాలనీ వాసులు, జహీరాబాద్ పట్టణ పోలీసులు కథనం ప్రకారం.. స్థానిక కాలనీకి చెందిన సయ్యద్ మహ్మద్‌అలీ ఇంటి తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి చొరబడ్డారు. ఇంట్లోని రెండు బీరువాలను పగులగొట్టి 15 తులాల రెండు బంగారం గొలుసులను ఎత్తుకెళ్లారు. క్లూస్ టీంను రప్పించి చోరీకి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జహీరాబాద్ పట్టణ పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

కోహీర్, నవంబర్ 5: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయ ఆవరణలోని నందీశ్వరుడి విగ్రహం వద్ద పలు రకాల ఆకారాలతో ప్రమిదలను ఏర్పాటు చేసి వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో కార్యదర్శి శివానంద్, జగదీశ్వర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బడంపేట రాచన్నస్వామి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శేఖాపూర్ తండాలో కార్డన్ సెర్చ్



శేఖాపూర్ తండాలో మాట్లాడుతున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

- 120 మంది పోలీసు బలగాలతో తనిఖీలు
- పోలీసుల అదుపులో పది మంది అనుమానితులు
- సరైనా పత్రాలు లేని 26 వాహనాలు సీజ్

జహీరాబాద్, నవంబర్ 5: గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు జహీరాబాద్ డివిజన్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున మండలంలోని శేఖాపూర్ గిరిజన తండాలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 120 మంది పోలీసులతో తనిఖీలు చేశారు. ఒక్కసారిగా పోలీసులు మూకుమ్మడిగా తనిఖీలు చేపట్టడంతో తండావాసులు ఉలిక్కిపడ్డారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న పది మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. సరైన పత్రాలు లేని 26 వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ తండాలో గంజాయి స్మగ్లింగ్ చేసేవారు ఉన్నట్టు తేలిందన్నారు. స్థానికులు స్వచ్ఛందంగా వారిని పోలీసులకు అప్పగించాలన్నారు. గుడుంబా, మట్కా, గంజాయి అమ్మినా, తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి, మట్కా, గుడుంబా విక్రయాలు చేపడితే ఎస్-ఎన్ఏబీ 87265 6777 లేదా 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు శివలింగం, జక్కుల హనమంతు, టాస్క్ ఫోర్సు ఎస్ఐ రామానాయుడు, ఎస్ఐలు కాశీనాథ్, రాజశేఖర్, ప్రభాకర్‌రావు, రాజేందర్‌రెడ్డి, నవీన్, సతీశ్‌వర్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 5: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్ జిల్లా అండర్-23 లీగ్ పోటీల్లో భాగంగా మంగళవారం కొండాపూర్ మండలం చీమలదారి కోనాపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో మెదక్, నిజామాబాద్ జట్లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మెదక్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 45.3 ఓవర్లలో 234 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మెదక్ బ్యాటింగ్‌లో హిశాంత్ 52, దీక్షిత్ 44 పరుగులు చేశారు. నిజామాబాద్ బౌలింగ్‌లో జస్ప్రీత్ 3 వికెట్లు వికెట్లు తీశాడు. తర్వాత బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ జట్టు 45 ఓవర్లలో 235 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఈ జట్టులో హర్షవర్ధన్ సింగ్ 114 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మెదక్ బౌలింగ్‌లో వేదాంత్ 3, యోగేశ్వర్ 2 వికెట్లు తీశారు. ఈ పోటీల్లో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

అదనపు కలెక్టర్ మాధురి

పుల్కల్, నవంబర్ 5: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలపెట్టొద్దని అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. మంగళవారం మండల కేంద్రం పుల్కల్‌తోపాటు మండల పరిధిలోని ముదిమాణిక్యం, కోడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పుల్కల్‌లో 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మరుసటి రోజే ఆపివేశారని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం ఆరబోసి 20 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కొనుగోళ్లు ప్రారంభించాలని తహసీల్దార్ కృష్ణకు సూచించారు.

పుల్కల్‌లో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

గుమ్మడిదల: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అఖిలేశ్‌రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 5: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి అఖిలేశ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వరుసక్రమంలో తీసుకోవాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి, రైతులకు తెలిపారు. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే కొనుగో లు చేయాలన్నారు. ఎంపీడీవో ఉమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

హత్నూరలో..

హత్నూర, నవంబర్ 5: హత్నూర మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం జడ్పీ సీఈవో స్వప్న పరిశీలించారు. దౌల్తాబాద్, మంగాపూర్, దౌలాపూర్, దేవులపల్లి, చందాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, డీపీఎం కొమురయ్య, డీటీ దావూద్, ఆర్ఐ శ్రీనివాస్, ఏపీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేకు సర్వం సిద్ధం

- ఇప్పటికే ఎన్యూమరేటర్లకు శిక్షణ పూర్తి
- నేటి నుంచి సర్వే షురూ..
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

జహీరాబాద్, నవంబర్ 5: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేకు జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సర్వే అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు సైతం పూర్తయ్యాయి. బుధవారం నుంచి సర్వే సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఇండ్ల జాబితాను సిద్ధం చేయనున్నారు. ఆ తర్వాత 75 అంశాలతో యజమాని పేరు వివరాలు సేకరించి ప్రతి ఇంటికీ స్టిక్కర్ అతికిస్తారు. ఆ తర్వాత మళ్లీ సమాచారంతో సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేస్తారు. ఇంటి యాజమాని అందుబాటులో లేకపోతే మళ్లీ అవకాశం కల్పిస్తారు. వలస వెళ్లిన వారి వివరాలు వారి బంధువులు తెలిపినా నమోదు చేసుకుంటారు.

మొత్తం 53,485 కుటుంబాలు

2011 గణాంకాల ప్రకారం.. జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, ఝరాసంగం మండలాల్లో మొత్తం 2,43,393 మంది జనాభా ఉండగా 53,485 కుటుంబాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసేందుకు 48 మంది సూపర్‌వైజర్లు, 505 మంది సిబ్బందిని నియమించారు. సర్వేలో నూతనంగా కాలనీలు, వార్డులు ఏర్పడిన దృష్ట్యా కుటుంబాల సంఖ్య పెరిగే ఆస్కారం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సర్వే చేపట్టేందుకు పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులను నియమించారు. ఉపాధ్యాయులకు మాత్రం మధ్యాహ్నం తర్వాత సర్వే చేసేందుకు వెసులుబాట కల్పించారు. పూర్తి చేసిన సర్వే అనంతరం సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చుతారు. సమగ్ర కుల గణన సర్వే అధికారులు, సిబ్బందికి ప్రజలంరూ సహకరించాలని ఆయా మండలాల సంబంధిత అధికారులు కోరుతున్నారు.

హుగ్గేల్లిలో కులగణన సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో జానకీరెడ్డి